సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



శుభకార్యం ఎట్ల చెయ్యాలి!

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కార్మికులు వివాహాది, శుభకార్యాల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగరేణి ఫంక్షన్ హాళ్లలో అరకొర వసతులతో అవస్థలు పడుతున్నారు. 8లో▸



ఎస్సార్పీ 3గనిలో గ్యాస్ ప్రమాదం

శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్సార్పీ 3గనిలో గ్యాస్ ప్రమాదం సంభవించింది. గురువారం విషవాయువు కార్బన్ మోనాక్సైడ్ వెలువడింది. ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అక్రమ కట్టడాలపై చర్యలు



కూల్చివేతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని 300 సర్వేనంబర్‌లో 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపట్టగా.. హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు ఆధ్వర్యంలో కూల్చి వేయించారు. కూల్చివేత ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడగలిగామని అన్నారు. గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, సీనియర్ అసిస్టెంట్ ప్రభులింగం, గిర్దావర్ లావణ్య, కారోబార్ చారి, నాయకుడు లగిశెట్టి రాజయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటన



పరీక్షలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దండేపల్లి: మండలంలోని మేదరిపేట, మాదాపూర్, మామిడిపల్లి గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ గురువారం పర్యటించారు. మేదరిపేట కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలించారు. నిర్మాణం బాగా లేకపోవడంతో ఇంజినీరును ఫోన్‌లో మందలించారు. మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరుతోపాటు విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి పరీక్షించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీవో మల్లేశం, ఎంఈవో రవీందర్, సీఆర్పీ నర్సయ్య, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



కంపోస్టుపిట్‌ను పరిశీలిస్తున్న ఫణిందర్

జైపూర్: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఫణిందర్‌రావు గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని కాన్కూర్ గ్రామాన్ని సందర్శించారు. నర్సరీని సందర్శించి ఎండకాలం నేపథ్యంలో సత్వరమే షేడ్‌నెట్ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిక, సేగ్రిగేషన్ షెడ్లను సందర్శించి పల్లెప్రకృతి వనంలో మొక్కలకు ప్రతీరోజు నీళ్లు పోయించాలని, శ్మశానవాటిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సేగ్రిగేషన్ షెడ్డులోని కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువును తయారీ పరిశీలించి సూచనలు చేశారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం స్థలం గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్‌కు సూచించారు. ఎంపీవో అనిల్‌కుమార్, సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ పర్యవేక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ, హాజీపూర్ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వై.రమేశ్‌కుమార్ గురువారం పర్యవేక్షించారు. 3,040 గొర్రెలు, 1,120 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ నెల 28వరకు చేపట్టనున్న నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని గొర్రె, పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు డాక్టర్ ఈ.సరిత, డాక్టర్ శాంతిరేఖ, ఎల్ఎస్ఏ అగ్నివేశ్, వెటర్నరీ సహాయకురాలు స్వప్న, ఆఫీస్ సబార్డినేట్ నారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్యంపై కమిటీ

- జిల్లాలో కలెక్టర్ చైర్మన్‌గా ఎథిక్స్ కమిటీ
- ముగ్గురు సభ్యులను ఎంపిక చేసిన ఎన్ఎంసీ
- రోగులకు మెరుగైన చికిత్సకు దోహదం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవల్లో నైతిక విలువలు పాటించేలా, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై విచారణ, చర్యలకు సిఫారసు తదితర అంశాల నియంత్రణకు జిల్లాలో ఎథిక్స్(నైతికత) కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ముగ్గురు వైద్యులను సభ్యులుగా ఎంపిక చేసింది. ఈ కమిటీలో జిల్లా నుంచి సీనియర్ పీడీయాట్రీషియన్ డాక్టర్ ఎస్.మల్లేశ్, సీనియర్ సర్జన్ డాక్టర్ సల్మాన్‌రాజు, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చందర్ సభ్యులుగా ఉన్నారు. త్వరలో కలెక్టర్ చైర్మన్‌గా ఉండే పూర్తిస్థాయి కమిటీ రూపుదిద్దుకోనుంది. ఈ మేరకు సభ్యులకు ఇప్పటికే ఎన్ఎంసీ నుంచి గుర్తింపు కార్డులు, హైదరాబాద్‌లో కమిటీ విధివిధానాలపై వర్క్‌షాప్ జరిగింది. జిల్లా వైద్యారోగ్యశాఖలో రిజిష్టర్ చేసుకున్న ప్రైవేటు ఆస్పత్రులపై బాధితులు ఎవరైనా ఫిర్యాదు ఇస్తే ఈ కమిటీ విచారణ చేపట్టి నిజానిజాలను పరిశీలించి ఆ ఆస్పత్రులపై చర్యలకు సిఫారసు చేస్తుంది. అలాగే ఎన్ఎంసీ ఇచ్చే సూచనలు, సలహాలు, ఆదేశాలు, స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో విలువలతో కూడిన వైద్యం అందేలా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

పుట్టగొడుగుల్లా ప్రైవేటు ఆసుపత్రులు

జిల్లాలో గత నాలుగేళ్ల వ్యవధిలోనే ప్రైవేటు ఆస్పత్రులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ప్రసవాలు, పిల్లలు, మల్టీ సూపర్‌స్పెషాలిటీ అంటూ పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. అనుమతులు, నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను కొన్ని ఆస్పత్రులు తుంగలో తొక్కుతూ చికిత్సల పేరుతో ఇష్టారీతిన వైద్యం సాగిస్తున్నాయి. రోగుల నుంచి అధిక డబ్బులు గుంజుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వీటితోపాటు నిబంధనల మేరకు కనీస అర్హత లేకున్నా కొందరు రోగులకు చికిత్స అందించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతోపాటు స్థానిక నర్సింగ్ అసోసియేషన్, మెడికల్ కౌన్సిల్‌లో కూడా కనీసం రిజిష్టర్ చేసుకోకుండా ఆస్పత్రులు వెలుస్తున్నాయి. ప్రతీ ఏడాది వైద్యారోగ్య శాఖకు తమ రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించని యాజమాన్యాలూ ఉన్నాయి. గత ఏడాది వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల సమయంలో ఇలాంటి లోపాలు బయటపడ్డాయి. ప్రైవేటు ఆసుపత్రి భవనాల ముందు బోర్డు, ప్రచారంలో ఉన్నట్లు సేవలు అందించలేకపోవడం ప్రధాన లోపంగా మారింది. ఇక కొన్ని చోట్ల డాక్టర్లు ఉంటారో ఉండరో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్య వృత్తిలో ఉన్న వారే కాకుండా రియల్ ఎస్టేట్, ఇసుక వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, అంబులెన్స్ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సైతం ఆసుపత్రులు నెలకొల్పడంతో నైతిక విలువలకు పాతరేసి, చికిత్స పూర్తిగా వ్యాపారంగానే మారిపోయింది. పాత తరం వైద్యుల కంటే ఈ తరం వైద్యుల్లో కొందరు వైద్యవృత్తిని కేవలం వ్యాపార దృష్టితోనే చూడడంతో ఆసుపత్రుల మధ్య పోటీ ఏర్పడి బాధితులకు నష్టం జరుగుతోంది. రోగులను ఆకర్షించేందుకు రూ.కోట్లలో పెట్టుబడి పెట్టిన ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా వైద్యం మారిపోతోంది. దీంతో ఏదైనా చికిత్స కోసం ఒక ఆసుపత్రికి వెళ్తే సరిపోతుందనే భావన రోగుల్లో క్రమంగా కోల్పోతోంది. ఒకరిని మించి ఒకరు ప్రచారం చేసుకోవడంతోనూ రోగులు సందిగ్ధంలో పడిపోతున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల తీరుతో నమ్మకం కోల్పోయి మెరుగైన చికిత్స కోసం ఒకటి, రెండు చోట్ల తిరగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కమిటీ జిల్లాలో సమర్థవంతంగా పని చేసి జిల్లాలోని గతి తప్పిన కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో విలువలు పాటించేలా పని చేస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

విలువలు పాటించేలా దోహదం

జిల్లాలో ఎథిక్స్ కమిటీ ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేసే వైద్యులు విలువలు పాటించేలా దోహదపడుతుంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నిబంధనల మేరకు కమిటీ విచారణ చేపడుతుంది. కమిటీ పూర్తి స్థాయి ఏర్పాటు, విధివిధానాలు వచ్చాక ఆ మేరకు పని చేస్తాం.

– డాక్టర్ ఎస్.మల్లేశ్, ఎథిక్స్ కమిటీ సభ్యుడు

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్

చెన్నూర్/నస్పూర్/మంచిర్యాలటౌన్: జిల్లాలోని పట్టణాల్లో ప్రజలు మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణాల్లో నెలకొన్న సమస్యలు, వీధి కుక్కలు, కోతుల బెడద, వీధి దీపాలు పని చేయకపోవడం, పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో అంతరాయం తదితర సమస్యలపై ఆయా మున్సిపాలిటీల కమిషనర్ల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం కోరవచ్చు.

నేడు..



చెన్నూర్ మున్సిపాల్టీ కమిషనర్ : జి.గంగాధర్
సంప్రదించాల్సిన నంబరు
91211 51760
సమయం : శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు

రేపు..



నస్పూర్ మున్సిపాల్టీ కమిషనర్ : టీ.రమేశ్
సంప్రదించాల్సిన నంబర్:
98662 37358
సమయం : శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

రేపు..



మంచిర్యాల మున్సిపాల్టీ కమిషనర్ : జి.రాజు
సంప్రదించాల్సిన నంబరు :
98499 05886
సమయం: శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ఏజెంట్ల చేతుల్లోకి ఆర్టీసీ కార్గో..!

- లాజిస్టిక్ నుంచి సంస్థ ఉద్యోగుల కుదింపు
- సకాలంలో వేతనాలు చెల్లించని కాంట్రాక్టరు
- ఇబ్బందుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



ప్రయాణికులు కూర్చోలేకుండా బస్సులోపల సరుకులు తరలిస్తున్న దృశ్యం

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు యాజమాన్యం ఆదాయ వనరులు అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా 2020 జూన్ 19నుంచి కార్గో సేవలు ప్రారంభించింది. నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీ టిక్కెటేతర ఆదాయంతో గాడిన పడుతోంది. ఇదివరకు పార్సిల్, రవాణా సేవలు ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిన ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) సరుకులు రవాణా చేస్తూ ఆదాయం సమకూర్చుకుంటోంది. లాభాలు వస్తున్న క్రమంలోనే యాజమాన్యం కార్గోను మళ్లీ ఏజెంట్ల పరం చేస్తూ వస్తోంది. మొదట ఒక ఫ్రాంటు అప్పగించిన సంస్థ మంచిర్యాల మినహాయిస్తే అన్ని బస్‌స్టేషన్లలో కమీషన్‌పై ఏజెంట్లకు అప్పస్తోంది.

నెమ్మదిగా..

మంచిర్యాల డిపో పరిధిలో మంచిర్యాల, చెన్నూర్, లక్సెట్టిపేట, జన్నారంలో పార్సిల్, కొరియర్ సర్వీస్ కేంద్రాలు ప్రారంభించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తోపాటు మంచిర్యాల బస్‌స్టేషన్‌లో 14 మంది ఆర్టీసీ ఉద్యోగులను నియమించారు. జన్నారం, లక్సెట్టిపేట, చెన్నూర్‌లో ఆర్టీసీ ఉద్యోగులను నియమించి లాజిస్టిక్(కార్గో) సరుకుల రవాణా పర్యవేక్షణ ఉద్యోగుల కనుసన్నల్లో నడిచేవి. ప్రస్తుతం మంచిర్యాలలో ఐదుగురు ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా బస్‌స్టేషన్‌లో ఉద్యోగులను తగ్గించి ట్రాన్స్‌పోర్టు చార్జీలపై 12శాతం కమీషన్‌కు ఏజెంట్లకు అప్పగించారు. మందమర్రి, జైపూర్, సీసీసీ కార్నర్‌లో ప్రైవేట్ ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లింది. దాదాపుగా అన్ని ప్రాంతాల్లో లాజిస్టిక్ సర్వీసు కేంద్రాలు ఏజెంట్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇంకోవైపు అంతర్రాష్ట్ర స్థాయికి విస్తరించారు. మహారాష్ట్రలోని నాందేడ్, ముంబయిలకు కార్గో, పార్సిల్ సేవలు విస్తరించారు. మంచిర్యాల నుంచి ముంబయికి నేరుగా బస్సుల రాకపోకలు లేకపోయినా జగిత్యాల వరకు పంపించి గమ్యానికి చేరుస్తున్నారు. రోజుకు రూ.30వేల నుంచి రూ.40వేల ఆదాయం మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి సమకూరిందని తెలుస్తోంది. ఒక్కోరోజు రూ.48 వేలు దాటిన సందర్భాలు ఉన్నాయి.

ఆర్టీసీ బస్సుల్లో సరుకుల రవాణా..

ఆర్టీసీ బస్సుల్లోని సీట్లపై సరుకులు వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముందు సీట్ల నుంచి నడవటానికి కూడా వీల్లేకుండా సరుకులు తీసుకురావడంతో ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటున్న సందర్భాలు అనేకం. బస్సులపైన క్యారేజీ లేకపోవడం.. వెనకాల డిక్కీలు అమర్చకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. ఇదే పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయి.. బస్సు లోపల, సీట్లపై సరుకులు పెరిగిపోయేలా మారేలా ఉందంటూ ఓ ఉద్యోగి చమత్కరించారు. విలువైన వస్తువులు డ్యామేజీ కాకుండా ఉండడం కోసమే బస్సులోపల తీసుకొస్తున్న ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశానుసారమే..

పార్సిల్, కొరియర్ సేవలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. చిన్న కవరు నుంచి పెద్ద సరకులను సురక్షితంగా రవాణా చేస్తున్నాం. వేగంతోపాటు సమయపాలన, సురక్షితమైన సేవలే లాజిస్టిక్ లక్ష్యం. కాంట్రాక్టు బిల్లులు సబ్మిట్ చేయకపోవడంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టర్‌కు ఒకటి రెండు రోజులు నోటీసులు అందజేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మేరకు ఏజెంట్లకు అవకాశం ఇస్తున్నం.

– రవీంద్రనాథ్, మంచిర్యాల డీఎం.

ఔట్‌సోర్సింగ్ విధులకు వేతనాలెప్పుడో..?

సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైనా పార్సిల్, కొరియర్ సర్వీసుల్లో ఆర్టీసీ ఉద్యోగుల స్థానంలో ఔట్‌సోర్సింగ్‌లను నియమించినప్పటి నుంచి ఆరు నెలల్లో ఒకరోజు కూడా పూర్తి స్థాయి వేతనం అందకుండా పోయింది. మంచిర్యాలలో 11 మందిని నియమించినా ఒక్కరోజు కూడా 8 మంది ఉద్యోగులు విధులు నిర్వహించిన దాఖలు తక్కువే. ఎంత జీతమో కాంట్రాక్టర్ ఇప్పటివరకు చెప్పలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసుకునే క్రమంలో ఒక్కొక్కరి నుంచి పెద్ద ఎత్తున వసూలు చేసినట్లు తెలుస్తోంది. పనిచేసిన కాలంలో వేతనాలు అడిగే సరికి కాంట్రాక్టరు రూ. 2వేల నుంచి రూ.5వేల వరకు చెల్లిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదేమి అడిగితే ఉద్యోగం చేస్తే చేయి.. లేకుంటే లేదు అని దబాయిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటూ పనిచేసిన కాలంలో డబ్బులు రాక.. ఉద్యోగం కోసం చెల్లించిన ముడుపులు లేక.. అష్టకష్టాలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. కాంట్రాక్టర్ బిల్లులు సబ్మిట్ చేయకపోవటంతోనే జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదే కాంట్రాక్టరుకు మరో రెండు మూడు టెండర్ల అప్పగించడం కోసమెరుపు. కాగా, ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాల రూపేణా చెల్లించేది ఎక్కువ కావడంతో ఆదాయం మిగులుతుందని భావించి ప్రైవేట్ ఉద్యోగులు, ఏజెంట్ల వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

నీటి సమస్య తీర్చాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

భీమిని: నీటి సమస్య పరిష్కరించాలని కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామ పంచాయతీ పరిధి భీంపూర్ కాలనీ వాసులు గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కాలనీకి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎండాకాలం నీరు లేక గ్రామ సమీపంలోని తోటల వద్ద, వాగు నీరు తెచ్చుకుంటున్నామని అన్నారు. ఎడ్లబండ్లతో డ్రమ్ముల ద్వారా తెచ్చుకుంటూ కష్టాలు పడుతున్నామని వాపోయారు. సర్పంచ్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భీంపూర్ కాలనీకి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని టొకెర భీమక్క, వడుగూరి ప్రేమల కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కరుణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సన్నద్ధం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యాస దీపికలు అందించాలని, ఫౌండేషన్ లిటరసీ న్యూమరికల్ కార్యక్రమం ద్వారా తరగతుల వారీగా విద్యార్థులపై శ్రద్ధ వహించాలని తెలిపారు. 'మన ఊరు–మన బడి' మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: డబుల్ బెడ్రూం ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు పంపిణీ చేస్తామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ కమిషనర్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మందమర్రి పరిధిలో 400, క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలో 286 ఇళ్ల పనులు పూర్తయ్యాయని, 4,360 దరఖాస్తులు రాగా 67 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మందమర్రిలో 24 వార్డులు, క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉన్నాయని, ప్రాంతాలు, కాలనీలు, వార్డుల వారీగా జాబితా తయారు చేయాలని తెలిపారు. జాబితాపై రిమార్కును స్పష్టంగా తెలియజేస్తూ ఈ నెల 25 సాయంత్రానికి అర్హుల జాబితా అందించాలని, 26న ప్రదర్శించేందుకు సిద్ధం చేయాలని, మూడు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించి జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పరిశీలించాలని, మార్చి నెల మొదటి వారంలో లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు, రోడ్లు భవనాల శాఖ ఈఈ రాము, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీలో తగాదాలను సృష్టించి ద్రోహం చేస్తే కార్యకర్తలు ఊరుకోరని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ కోసం, ప్రజల కోసం పాటుపడుతున్న నాయకులపై ఎక్కడి నుంచో వచ్చిన వారు తగాదాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తే ఊరుకోబోమని అన్నారు. రెండు నెలలుగా తాము ఓపిక పడుతున్నామని, స్థానికేతరులు వచ్చి పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు.

'పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నాం'

బెల్లంపల్లికి చెందిన అఫ్జల్, జయరాం, శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మీడియా ద్వారా గతంలోనే ప్రకటించారని, బుధవారం డీసీసీ అధ్యక్షురాలికి సమాచారం ఇవ్వకుండా పార్టీ కండువాలను ఎలా కప్పుకుంటారని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రను కాంగ్రెస్ నాయకులు ఎప్పుడో ప్రారంభించి చేపడుతుండగా, కాంగ్రెస్ పార్టీకే పోటీగా మరో యాత్రను చేపట్టడం సరికాదన్నారు. అఫ్జల్, జయరాం, శ్రీనివాస్‌లను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని, గొడవలను సృష్టించే వారిపై పీసీసీకి ఫిర్యాదు చేస్తున్నామని అన్నారు.

మాంసాహార వ్యర్థాలు బయట వేస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ గంగాధర్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చికెన్, మటన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వీధి కుక్కల సంచారం పెరిగిందని, వాటి నివారణ కోసం వ్యాపారులు సహకరించాలని తెలిపారు. చికెన్, మటన్ వ్యర్థాలను మున్సిపాలిటీ వాహనంలో మాత్రమే వేయాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పడవేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సంతోష్, శానిటేషన్ జవాన్ సమ్మయ్య, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గురువారం తెల్లవారు జామున రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ అవుట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు తెల్లవారుజామున 1.40 గంటల ప్రాంతంలో ఢీకొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ కలర్ ఆఫ్ టీ షర్ట్, లైట్ ప్యారెట్ కలర్ షాట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద రెడ్, బ్లూకలర్ బ్లాంకెట్లు ఉన్నాయి. మృతదేహాన్ని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9440900792, 9440700038 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మద్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు దేశీదారు మద్యం తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో మద్యం పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం తరలిస్తున్న గడి అంజన్న, కామ్రె ప్రవీణ్‌లను విచారించగా కాగజ్‌నగర్‌లోని ఒక మద్యం దుకాణం నుంచి గూడెంలోని బెల్టుదుకాణానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను, కారులోని మద్యాన్ని ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

చుక్కల దుప్పిపై కుక్కల దాడి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ 9 గ్రామంలోకి గురువారం వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో కాగజ్‌నగర్‌లోకి పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యాధికారి విజయ్‌కుమార్ వైద్య చికిత్సలు అందించిన అనంతరం సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో బీట్ అధికారి సతీశ్, సిబ్బంది సుధాకర్, ప్రశాంత్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది ఆత్మహత్య

చెన్నూర్: పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీరాంభట్ల శరత్‌కుమార్ కుమారుడు రాజీవ్ శర్మ (29) మంగళవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజీవ్ శర్మ బెంగళూర్ హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం చెన్నూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు తీన్మార్ మల్లన్న హాజరయ్యారు.

మద్యం తాగించలేదని కత్తితో దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాంటా చౌరస్తా వద్ద గురువారం మద్యం తాగించలేదని వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం హన్మాన్ బస్తీకి చెందిన శివ, బూడిదగడ్డ బస్తీ వాసి మల్లేశ్ స్నేహితులు. వీరిద్దరు ఎప్పటిమాదిరిగానే కాంటా చౌరస్తా వద్ద కలుసుకున్నారు. తనకు మద్యం తాగించాలని శివ మల్లేశ్‌ను అడిగాడు. ఇందుకు మల్లేశ్ నిరాకరించడంతో కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న కొబ్బరిబోండాల దుకాణం వద్ద ఉన్న కత్తి తీసుకుని దాడి చేయడంతో స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 100కు సమాచారం అందించడంతో వన్‌టౌన్ ఎస్సై సంతోశ్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్సైని వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.

శుభకార్యం ఎట్ల చెయ్యాలె!

- సింగరేణి ఫంక్షన్‌హాళ్లలో అరకొర వసతులు
- కంపుకొడుతున్న టాయిలెట్లు
- ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు
- ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు వెళ్తే రూ.లక్ష గుల్లా


కృష్ణాకాలనీలోని సింగరేణి ఫంక్షన్‌హాల్

శ్రీరాంపూర్(మంచిర్యాల): వివాహాది, ఇతర శుభకార్యాలు చేసుకోవాలంటే అన్ని వసతులు ఉన్న ఫంక్షన్‌హాల్‌లేక శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపనీ వ్యాప్తంగా అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌లో 8 భూగర్భ గనులు, రెండు ఓసీపీల్లో 9,494 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. కార్మికుల కోసం గతంలో సంస్థ యాజమాన్యం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్, కృష్ణాకాలనీ కమ్యూనిటీ హాల్, నస్పూర్ కాలనీ సింగరేణి గార్డెన్ (పాత కమ్యూనిటీ హాల్), సింగరేణి సేవా భవన్, అధికారుల కోసం సీసీసీ టౌన్‌షిప్‌లోని ఎస్సీఓఏ క్లబ్, బంగ్లా ఏరియాలో ఇల్లందు క్లబ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సింగరేణి గార్డెన్ మినహా మిగిలిన మూడు ఫంక్షన్‌హాళ్లు అధ్వానంగా మారాయి. వీటిలో సీటు కెపాసిటీ నాలుగు వందలకు మించి ఉండదు. వధువు, వరుడు రూంలు సరిగా లేవు. నిర్వహణలేక టాయిలెట్స్ కంపుకొడుతున్నాయి. శ్రీరాంపూర్ సీఈఆర్‌క్లబ్ మధ్యలో సీలింగ్ ఫ్యాన్లు లేకపోవడంతో చెమటలు కక్కుతూ కూర్చోవాల్సిన పరిస్థితి. స్టేజీ ఎత్తు తక్కువగా ఉండడంతో చేతులు పైకెత్తితే ఫ్యాన్లు తగులుతాయి. హ్యాండ్‌వాష్‌లో ఒకే నల్లా పనిచేస్తోంది. సేవా భవన్‌లో స్లాబ్ కిందికి ఉండడంతో వేసవిలో తీవ్ర వేడి వస్తుంది. కృష్ణాకాలనీ కమ్యూనిటీ హాల్ సీలింగ్ అధ్వానంగా ఉంది. వంట షెడ్డు చాలా చిన్నదిగా ఉంది. అన్ని హాళ్లలో రీసౌండ్ వస్తోంది.

కంపెనీ వసూలు చేసే అద్దె (విద్యుత్ బిల్లులు అదనం)

కమ్యూనిటీహాల్	క్లబ్ సభ్యులకు	ఉద్యోగులకు	ప్రైవేటు వారికి
కృష్ణాకాలనీ	రూ.558	రూ.558	రూ.4,208
నస్పూర్ సేవాభవన్	రూ.558	రూ.558	రూ.4,208
సీఈఆర్ క్లబ్	రూ.8వేలు	రూ.13వేలు	రూ.18వేలు
సింగరేణి గార్డెన్	రూ.4,208	రూ.4,208	లేదు

ప్రైవేటుకు వెళ్తే తడిసి మోపెడు...

ఇన్ని అసౌకర్యాల నడుమ ఫంక్షన్ చేసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో చాలా మంది కార్మికులు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఒక్కో ఫంక్షన్‌కు రూ.లక్ష వరకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. మండపం, డెకరేషన్స్‌కు వారు అడిగినంత ఇవ్వాల్సిందే. సింగరేణి ఫంక్షన్‌హాళ్లలో వసతులు లేని కారణంగానే వీటికి డిమాండ్ ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు. వేలకోట్ల డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులను సింగరేణికి సంబంధంలేని ఏరియాల్లో అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నారని, కార్మికులకు అవసరమైన ఫంక్షన్‌హాళ్లలో సౌకర్యాలపై పట్టించుకోకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సువిశాలమైన కంపెనీ స్థలంలో అన్ని హంగులు, ఆధునిక సౌకర్యాలతో ప్రైవేటుకు దీటుగా ఏరియాకు ఒకటైనా ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేయాలని సింగరేణి కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

యాజమాన్యానికి విన్నవిస్తాం



ప్రస్తుతం కంపనీలో ఉన్న అన్ని కమ్యూనిటీ హాళ్లు, క్లబ్బులు చాలా ఏళ్ల క్రితం నిర్మించనవే. వీటిని ఎంత ఆధునీకరించినా శుభకార్యాలకు అనుకూలంగా ఉండడంలేదు. ఈ అసౌకర్యాలతో కార్మికులు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లకు దీటుగా కంపనీ వెయ్యి మంది కూర్చునేలా అన్ని వసతులు, హంగులతో కూడిన ఏరియాకో ఫంక్షన్‌హాల్ నిర్మించాలి. దీనిపై యాజమాన్యానికి విన్నవిస్తాం.
– మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

'కంటి వెలుగు' సద్వినియోగించుకోవాలి


శిబిరాన్ని సందర్శించిన సుబ్బారాయుడు

తాండూర్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు కోరారు. గురువారం మాదారం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరానికి వస్తున్న ప్రజలకు పరీక్షలు చేయాలని సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు కుమారస్వామి, అనిల్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం పనులు తనిఖీ

భీమారం(చెన్నూర్): మండలంలోని బూర్గుపల్లి, ఎలకేశ్వరం, కొత్తపల్లి గ్రామాల్లో చేపట్టిన హరితహారం పనులను గురువారం హైదరాబాద్‌లోని ఎకౌంట్ జనరల్ (ఏజీ) టీం సభ్యులు తనిఖీ చేశారు. వాటికి ఖర్చుచేసిన నిధుల గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారివెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సతీశ్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఎం ఎస్తర్ డేవిడ్, కార్యదర్శులు ఉన్నారు.

25న బీసీ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం


మాట్లాడుతున్న నరెడ్ల శ్రీనివాస్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న బీసీ జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని గాండ్ల తేలికుల సంఘ భవనంలో కుల సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ సామాజిక వర్గాలకు చెందిన రాజకీయ నాయకులు, న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు, జర్నలిస్టులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడుపు రాంప్రకాశ్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, అఖిలగాండ్ల తేలి కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ది చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీ నులిగొండ ప్రకాశ్, గౌడ సంఘ నాయకులు గుర్రం రాజేశంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రక్కు బోల్తా

- రూ.8 లక్షల విలువైన ముడి పదార్థం నేలపాలు


బోల్తాపడిన ట్రక్కు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని పాలచెట్టు మూలమలుపు వద్ద గురువారం ఎస్ఎంఈ (స్లర్రీ మిక్స్‌డ్ ఎక్స్‌ప్లోజివ్) ట్రక్కు బోల్తా పడింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని సెంటినరీకాలనీ నుంచి మందమర్రి ఏరియాలోని కళ్యాణీఖని ఓసీకి పది టన్నుల ఎస్ఎంఈ లోడుతో వస్తున్న ట్రక్కు పాలచెట్టు మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ రమణ ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా రూ.8 లక్షల విలువైన ముడిపదార్థం నేలపాలైంది. సింగరేణి అధికారులు, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు లేకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రాణనష్టం జరుగక ముందే స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జీరో ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న డీడీఎంఎస్ అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): జీరో ప్రమాదాలే లక్ష్యంగా పనిచేయాలని డీడీఎంఎస్ (డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) అధికారులు జ్ఞానేశ్వర్, వెంకన్న, ప్రేంకుమార్ అన్నారు. గురువారం ఎస్సార్పీ 3 గనిలో సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య ఆధ్వర్యంలో డెరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శాఖ అధికారులతో సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గనిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు వంటి వాటిపై చర్చించారు. జీరో ప్రమాదాల సింగరేణిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, ఏజెంట్లు గోపాల్‌సింగ్, సత్యానారాయణ, గని మేనేజర్ సంతోశ్‌కుమార్, సేఫ్టీ అధికారి మహేందర్, వెంటిలేషన్ అధికారి రమేశ్, ఇంజినీర్ అరుణ్‌కుమార్, పిట్ సెక్రటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ జాతీయ ప్లీనరీలో జిల్లా నేతలు


సంజీవరెడ్డికి పూలబొకే ఇస్తున్న రమేశ్

శ్రీరాంపూర్(మంచిర్యాల): రెండు రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న ఐఎన్టీయూసీ జాతీయ 33వ ప్లీనరీకి జిల్లా నుంచి ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, విద్యుత్ ఉద్యోగుల సంఘం నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్రె రమేశ్, నాయకులు గంగాధర్, నీలం ఐలేశ్ హాజరయ్యారు. ఈ ప్లీనరీలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యక్రమాలను రూపొందించినట్లు వారు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం అవుతున్నాయన్నారు. వీటిని రక్షించువాలంటే కార్మికోద్యమాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత కార్మికవర్గ సమస్యలపై తమ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు.

'గోమాస'పై దాడి అమానుషం



మాట్లాడుతున్న నేతకాని సంఘం నాయకులు

బెల్లంపల్లి: నేతకాని సామాజిక వర్గానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్‌పై దాడి అమానుషమని సంఘం రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ దుర్గం గోపాల్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తుండగా మార్గమధ్యంలో కాంగ్రెస్‌లోని ఓ వర్గం నాయకులు అటకాయించి దాడి చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు బోర్లకుంట ప్రభాకర్, రామటెంకి వాసుదేవ్, గోమాస భీమయ్య, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు దుర్గం భానుప్రసాద్, శ్రీకాంత్, సంపత్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

- అన్నాచెల్లెళ్లకు సాయమందించేందుకు ముందుకు..
- నిత్యావసరాలు అందించిన బాలల సంరక్షణ అధికారులు
- నగదు సాయం చేస్తున్న దాతలు

ఆ నలుగురికి.. మేమున్నామని


వంటపాత్రలు, సరుకులు అందజేస్తున్న దహెగాం మండల యువకులు

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం(సిర్పూర్): తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్లను ఆదుకోవడానికి మేమున్నామంటూ పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న ఆ గిరిజన బిడ్డలకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులతో పాటు నగదు సాయం అందిస్తున్నారు. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన సిడాం రాజు అతని చెల్లెళ్లు మమత, దీపిక, దివ్య పడుతున్న అవస్థలపై బుధవారం 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చిన్నారులకు రెండో రోజు కూడా దాతలు సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

నిత్యావసరాలు అందజేత

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ ఆధ్వర్యంలో అన్నాచెల్లెళ్ల ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందజేశారు. అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీప, దివ్యలను గురుకుల పాఠశాలలో చేర్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలైన దివ్యకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్స్ ప్రవీణ్‌కుమార్, జమున, సఖి సిబ్బంది శ్రీనిధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

సాయమందిస్తున్న దాతలు

- దహెగాం మండల కేంద్రంతో పాటు, గిరవెల్లి, పంబాపూర్, మర్రిపల్లి, గ్రామాలకు చెందిన యువకులు వంట పాత్రలు, దుస్తులు, నిత్యావసరాలు, పాఠశాలకు వెళ్లే దీపిక, దివ్యకు స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, నోట్‌పుస్తకాలు, తదితర వస్తువులు అందజేశారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.
- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన క్రాంతి అతని స్నేహితుల ద్వారా ఆరు నెలలపాటు నెలకు రూ.2 వేలు సాయమందించేందుకు ముందుకు వచ్చారు.
- నర్సాపూర్(జి)కి చెందిన ఉపాధ్యాయుడు నరేందర్ రూ.వెయ్యి అందించారు.
- దహెగాం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. వారి ఇంటికి మరమ్మతు చేయించేందుకు మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు.

'దళితులంటే సీఎం కేసీఆర్‌కు వివక్ష'



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుణ

మందమర్రిరూరల్(చెన్నూర్): దళితులంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివక్ష అని, ఎమ్మెల్యే సాయన్న మృతి చెందితే అంత్య క్రియలు ప్రభుత్వ లాంచనాలతో ఎందుకు నిర్వహించలేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ ప్రశ్నించారు. గురువారం మందమర్రిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సినిమా యాక్టర్లు, సెలబ్రిటీలు చనిపోతే అధికార లాంచనాలతో దహన సంస్కారాలు జరిపిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. దళితులను విస్మరిస్తే కేసీఆర్‌కు పుట్టగతులుండవని రాబోయే ఎన్నికల్లో తగినరీతిలో బుద్ధిచెప్తారన్నారు. సమావేశంలో నాయకులు భవాని, వినోద, విజయ్, శ్రీకాంత్ ఉన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు లాంఛనంగా జరిపించకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత ద్రోహి అనిపించుకున్నారని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేవీ ప్రతాప్‌పై దాడి గర్హనీయం

బెల్లంపల్లి: ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేవీ ప్రతాప్‌పై దాడి గర్హనీయమని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు జైన శ్రీనివాస్, రాజన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో సౌమ్యుడిగా పేరున్న ప్రతాప్‌పై చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. మంచి వ్యక్తిత్వం, ప్రజా నాయకుడిగా పేరుగాంచిన ప్రతాప్‌పై దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ శ్రేణులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు752 విద్యార్థులకు గానూ 716 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 486 మందికి గానూ 473 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

రెండు వాహనాలు సీజ్

లక్సెట్టిపేట: ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని ఎంవీఐ రాహుల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేని రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అన్నిరకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌ను తరలించారు.

కుక్కల బెడద నివారించాలి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద నివారించాలని కోరుతూ గురువారం పట్టణ యువకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పిచ్చి కుక్కలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి కుక్కల బెడద నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమియోద్దీన్, వాహిద్, సాజిత్‌ఖాన్, జావిద్‌ఖాన్, రాములు, తిరుపతి పాల్గొన్నారు.

ఎల్ఐసీ స్వర్ణోత్సవ సంబురాలు


సంబరాలు జరుపుకుంటున్న ఉద్యోగులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో గురువారం స్వర్ణోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్వీ ప్రసాదరావు, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్కే శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ సంజయ్ కేక్ కట్ చేశారు. డివిజనల్ మేనేజర్ ఎస్వి ప్రసాదరావు మాట్లాడుతూ మంచిర్యాల ఎల్ఐసీ శాఖ వ్యాపార లావాదేవీలలో దేశంలోని 2048 శాఖలలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అత్యధికంగా పాలసీలు చేయించిన ఏజెంట్లకు ప్రతిభా పురస్కారాలు అందించారు. సభ్యులు నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన చెన్నూర్, లక్సెట్టిపేట జట్లకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు, లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మంచిర్యాల బ్రాంచ్ అధ్యక్షుడు జే తిరుపతయ్య, సభ్యులు సాగర్, వాసు, రాజేశం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి సదరం శిబిరాలు

పాతమంచిర్యాల: జిల్లాలో మార్చి1 నుంచి నిర్వహించనున్న సదరం వైద్య శిబిరాలను అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ కాల పరిమితి పూర్తయిన వారు రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి హాజరుకావాలని ఆయన కోరారు.

బ్లడ్ క్యాన్సర్‌తో బాలుడు మృతి

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్ది జశ్వంత్(12)బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్దిసునీత–రమేశ్ దంపతుల ఏకైక కుమారుడు జశ్వంత్. మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న జశ్వంత్‌కు తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ నెల 22న ఇంటికి వచ్చిన జశ్వంత్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.